ESTD : 1999

విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

స్టేట్ విజన్
STATE VISION

బుధవారం 25-11-2026 పేజీలు : 16

సర్వే చేసింది ఎవరు..
జాబితా మార్చింది ఎవరు. ?

15 పేజీలో...

ప్రజల భద్రతే లక్ష్యంగా గ్రామాల్లో
విస్తృత తనిఖీలు

- గుడూరు పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం చిన్నయెల్లాపూర్ గ్రామంలో 150 ఇళ్లలో తనిఖీలు..
- 20 అనుమానాస్పద వాహనాల గుర్తింపు
- 15 లీటర్ల గుడుంబా స్వాధీనం..
- 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం



2 పేజీలో...

బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన
ప్రజా వీరుడు పండుగ సాయన్న

– ఘనంగా పండుగ సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమం

– స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

పరిగి నియోజకవర్గం గండీడ్ మండలంలోని పలు గ్రామాల్లో పండుగ సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కొమిరెడ్డిపల్లి గ్రామంలో పండుగ సాయన్న విగ్రహాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారు, పరిగి ఎమ్మెల్యే శ్రీ టి. రామ్మోహన్ రెడ్డి గారు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ శ్రీ బండా ప్రకాష్ గారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ గారు, మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి గారు, యువకులు, గ్రామస్తులు, వివిధ మండలాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



7 పేజీలో...

అనుమతుల పేరుతో పెద్ద ఎత్తున
ఇసుక రవాణా..!



- అడ్డుకున్న గ్రామస్తులు
- అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్

9 పేజీలో...

విజన్ ఆంధ్ర కథనానికి స్పందన..

- ప్రమాదకర ఇనుప కంచె తొలగించిన విద్యుత్ అధికారులు!
- వార్త ప్రచురితమైన వెంటనే స్పందించిన విద్యుత్ శాఖ సిబ్బంది
- ప్రమాదం జరగకముందే చర్యలు చేపట్టడంపై స్థానికుల హర్షం

భీమదేవరపల్లి నవంబర్ 24 (విజన్ ఆంధ్ర): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మేజర్ గ్రామపంచాయతీ ముల్కనూర్‌లోని కోటగడ్డ కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప కంచె ప్రమాదకరంగా మారిందంటూ విజన్ ఆంధ్ర దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న ఇనుప కంచె వల్ల ప్రజలకు ప్రమాదం పొంచి ఉందని, అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణ చర్యలు చేపట్టాలని కథనంలో ప్రస్తావించడంతో విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ఇనుప కంచెను సరిచేశారు.

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా పాత్రకు,



కథనంపై వెంటనే స్పందించి చర్యలు తీసుకున్న విద్యుత్ శాఖ అధికారులకు స్థానికులు అభినందనలు తెలిపారు. ప్రజా సమస్యలపై విజన్ ఆంధ్ర నిరంతర పోరాటం.. అధికారుల స్పందనే మా కథనాలకు సార్థకత!

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఇందిరమ్మ జీవిత బీమా

- అర్హులైన వారు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- బీజేపీ మండల అధ్యక్షుడు పోతన్న



ముధోల్, నవంబర్ 24:విజన్ ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఉచితంగా రూ. 5 లక్షల ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా సౌకర్యాన్ని కల్పిస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న తెలిపారు.మంగళవారం ముధోల్ మండల కేంద్రంలోని కొల్లి గల్లి హనుమాన్ ఆలయం వద్ద ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించిన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను నిర్వహించారు. మండల కేంద్రంలో మొత్తం ఐదు కేంద్రాల ద్వారా బీమా నమోదు ప్రక్రియ కొనసాగుతున్నట్లు గ్రామపంచాయతీ ఈఓ అన్వర్ అలీ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుటుంబంలోని 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన అర్హులకు ఈ బీమా పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన వారు తమ రేషన్ కార్డు, ఆధార్ కార్డులను వెంట తీసుకువచ్చి అవసరమైన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి అర్హ కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు విష్ణు, నాయకులు పల్లె నాగేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జీడికల్ దేవస్థానం డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి కృతజ్ఞతలు



లింగాల గణపురం నవంబర్ 24 (విజన్ ఆంధ్ర) జనగామ జిల్లా లింగాల గణపురం మండలంలో హన్మకొండలోని నివాసంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి శ్రీ కడియం శ్రీహరి గారిని జీడికల్ గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా జీడికల్ దేవస్థానం డైరెక్టర్‌గా అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిటకోరు సంపత్, వార్డు సభ్యులు కళ్లే వెంకటేష్, పీఏసీఎస్ డైరెక్టర్ వేముల కృష్ణారెడ్డి, జీడికల్ దేవస్థానం డైరెక్టర్ కళ్లే మల్లేష్, గ్రామ శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ బర్ల కిషోర్, మాజీ డైరెక్టర్ బస్వగాని నరేష్ గౌడ్, గ్రామ యూత్ అధ్యక్షుడు దూర్గి నాగరాజు, మండల యూత్ నాయకుడు నిమ్మల కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతే లక్ష్యంగా గ్రామాల్లో విస్తృత తనిఖీలు

- గుడూరు పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం చిన్నయెల్లాపూర్ గ్రామంలో 150 ఇళ్లలో తనిఖీలు..

-20 అనుమానాస్పద వాహనాల గుర్తింపు

- 15 లీటర్ల గుడుంబా స్వాధీనం..

- 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం



మహబూబాబాద్ బ్యూరో నవంబర్ 24(విజన్ ఆంధ్ర) : మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడికి పోలీసులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారు.

ఈ క్రమంలో గుడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నయెల్లాపూర్ గ్రామంలో ఉదయం 5:30 గంటల నుంచి 7:30 గంటల వరకు సీఐ గుడూరు ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 ఇళ్లను తనిఖీ చేసి, గ్రామంలోని వాహనాలు, అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై క్షుణ్ణంగా పరిశీలన చేపట్టారు.

తనిఖీల్లో సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 20 వాహనాలను గుర్తించారు. అదేవిధంగా అక్రమంగా తయారు చేస్తున్న 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని, సుమారు 800 లీటర్ల బెల్లం పానకాన్ని నిబంధనల ప్రకారం ధ్వంసం చేశారు.

ఈ సందర్భంగా గ్రామస్థులకు రోడ్డు భద్రతా నియమాలు, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తతపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని గూడూరు సీఐ వినయ్ సూచించారు.

జిల్లాలో నేరాల నియంత్రణ, అక్రమ మద్యం తయారీ నిర్మూలన, మాదకద్రవ్యాల కట్టడికి నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని ఎస్పీ డాక్టర్ శబరీష్, ఐపీఎస్ స్పష్టం చేశారు. ప్రజలు ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

సారంగాపూర్ మార్కెట్ యార్డ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



సారంగాపూర్, నవంబర్ 24 (విజన్ ఆంధ్ర): మండలంలోని కొట్ల (బి) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సారంగాపూర్ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ కూనేరు భూమన్న మంగళవారం ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ఏ-గ్రేడ్ రకానికి రూ. 2,461, సాధారణ రకానికి రూ. 2,441 మద్దతు ధరతో పాటు గుర్తించిన సన్న వడ్లకు అదనంగా రూ. 500 బోనస్ పొందాలని ఆయన కోరారు. రైతులు 17 శాతం లోపు తేమ ఉండేలా ధాన్యాన్ని తీసుకురావాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి మాధవరావు, పిఎసిఎస్ చైర్మన్ నారాయణ రెడ్డి, బొల్లోజి నర్సయ్య, పిఎసిఎస్ సెక్రటరీ తోట మల్లేష్ రైతులు పాల్గొన్నారు.

గుమ్మడవెల్లిలో ఘనంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా కార్యక్రమం



లింగాల గణపురం నవంబర్ 24 (విజన్ ఆంధ్ర): జనగామ జిల్లా లింగాల గణపురం మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో ఈరోజు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా కార్యక్రమం గ్రామ శాఖ అధ్యక్షుడు వర్రె బాలరాజు, ఉపాధ్యక్షుడు గోసంగి నరసింహులు, గ్రామ సర్పంచ్ అముదాల సుమలత-రమేష్, ఉపసర్పంచ్ కూకట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది.

ఈ కార్యక్రమంలో మెంబర్ గువ్వల కృష్ణయ్య, జెడ్పిటిసి దేవస్థానం డైరెక్టర్ సంగీ నరసింహులు, సేవాదళ్ మండల అధ్యక్షుడు దండిగా ఐలయ్య, సేవాదళ్ జిల్లా సహాయ కార్యదర్శి భైరపాక యాదగిరి, ఎస్సీ సెల్ జిల్లా వైస్ చైర్మన్ గోసంగి కిషన్, ఎస్ఎస్ఎల్ జిల్లా కార్యదర్శి భైరపాక రాజు, గుమ్మడవెల్లి యూత్ ఉపాధ్యక్షుడు భైరపాక జగన్, సీనియర్ నాయకులు బోలి గట్టయ్య, గువ్వల రాజు, వర్రె ఐలయ్య, కటకం సత్యనారాయణ, మేడుదుల బాలయ్య, గువ్వల రామ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు కలిగే ప్రయోజనాలను వివరించి, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాయకులు సూచించారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మామిడ్యాల గ్రామంలో ఇందిరమ్మ బీమా నమోదు షురూ

- నిరుపేద కుటుంబాలకు రూ. 5 లక్షల భరోసా

- ప్రజా పాలనలో తెలంగాణ దేశానికే ఆదర్శం

- మామిడ్యాల గ్రామ సర్పంచ్ ఎడ్ల పోచయ్య



గజ్వేల్ నియోజకవర్గం, 24 నవంబర్ 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా ములుగు మండలం మామిడ్యాల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం గ్రామ సర్పంచ్ ఎడ్ల పోచయ్య ఆధ్వర్యంలో 'ఇందిరమ్మ బీమా పథకం' నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎడ్ల పోచయ్య మాట్లాడుతూ.. గ్రామంలో ఈ నెల 29వ తేదీ వరకు ఇందిరమ్మ బీమా పథకం కార్యక్రమాన్ని కొనసాగిస్తామని, అర్హులైన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ బీమా పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక భరోసా అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కృష్ణ, వార్డు సభ్యులు ప్రతాప్ రెడ్డి, అనిల్ చారి, స్వామి, కార్యదర్శి రాజు, ఆపరేటర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

- విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి..

విద్యార్థులకు ఎమ్మెల్యే సూచన

బైంసా, నవంబర్ 24: విజన్ ఆంధ్ర ముధోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఉదయం మార్నింగ్ వాక్‌లో భాగంగా విద్యార్థులతో కొద్దిసేపు సరదాగా గడిపారు. ఈ సందర్భంగా వికాస్ స్కూల్, మైనారిటీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎమ్మెల్యేను కలవడంతో ఆయన వారితో ఆప్యాయంగా ముచ్చటించారు.విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రతిరోజూ వ్యాయామం, మార్నింగ్ వాక్ వంటి మంచి అలవాట్లను అలవర్చుకోవాలని, క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.అనంతరం విద్యార్థులతో సరదాగా మాట్లాడి, వారితో కలిసి ఫొటోలు దిగారు. ఎమ్మెల్యే తమతో ఆప్యాయంగా మాట్లాడటంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులే దేశ భవిష్యత్తు అని, వారి విద్య, ఆరోగ్యం, అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ఇందిరమ్మ జీవిత బీమాతో పేద కుటుంబాలకు భరోసా : కందూరి ఐలయ్య



కుకునూరుపల్లి, నవంబర్ 24, విజన్ ఆంధ్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పేద కుటుంబాలకు అండగా నిలుస్తోందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కందూరి ఐలయ్య అన్నారు. ఇందిరమ్మ జీవిత బీమా పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మంగళవారం కుకునూరుపల్లి మండలంలోని కొనాయిపల్లి, మాత్పల్లి గ్రామాల్లో ఇందిరమ్మ జీవిత బీమా పత్రాలను పంపిణీ చేశారు. కొనాయిపల్లిలో సర్పంచ్ మంజుల రాములు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజయ్యతో కలిసి అయిలయ్య పత్రాలు అందజేశారు. మాత్పల్లిలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడితో కలిసి లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సంపత్ మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి

అసలు కారణాలను దాచిపెట్టి విద్యార్థిపై నిందలు వేయడం సరికాదు: ఏఐపీఎస్‌యూ

బాసర : నవంబర్ 24: విజన్ ఆంధ్ర బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థి సంపత్ కుమార్ మృతి ఘటనపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపించి అసలు కారణాలను వెలికితీయాలని ఏఐపీఎస్‌యూ నిర్మల్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. నిరుపేద కుటుంబానికి చెందిన ప్రతిభావంతుడైన విద్యార్థి మృతి తీవ్ర ఆవేదన కలిగించిందని జిల్లా కార్యదర్శి గడపాలి పరమేష్ పేర్కొన్నారు.విచారణ పూర్తికాకముందే ఆన్‌లైన్ బెట్టింగ్ కారణంగానే సంపత్ ఆత్మహత్య చేసుకున్నాడంటూ ప్రచారం చేస్తూ విద్యార్థిపై నిందలు వేయడం సరికాదన్నారు. వాస్తవాలు వెలుగులోకి రాకముందే వ్యక్తిగత కారణాలను తెరపైకి తెచ్చి అసలు సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేయకూడదని సూచించారు. క్యాంపస్‌లో విద్యార్థుల మానసిక ఒత్తిడిని గుర్తించే సమర్థవంతమైన కౌన్సెలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, వసతి గృహాల్లో అధికారుల పర్యవేక్షణ పెంచాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రమేయం ఉంటే, నిషేధిత యాప్‌లు విద్యార్థులకు ఎలా అందుబాటులోకి వస్తున్నాయో ప్రభుత్వం, సైబర్ నేరాల పోలీసులు విచారణ జరపాలని కోరారు.సంపత్ మృతి వెనుక ఉన్న వాస్తవాలను



ఆధారాలతో సహా ప్రజల ముందుంచాలని, బాధిత విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం, విశ్వవిద్యాలయ యంత్రాంగం అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. తండ్రి లేని నిరుపేద కుటుంబానికి చెందిన సంపత్‌ను కోల్పోయిన తల్లికి, కుటుంబానికి అన్ని విధాలా సహాయం అందించాలని ఏఐపీఎస్‌యూ నిర్మల్ జిల్లా కార్యదర్శి గడపాలి పరమేష్ కోరారు.

సంపత్ ఆత్మహత్యపై అసత్య ప్రచారాలు మానుకోవాలి

- విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి..

- కుటుంబానికి కోటి రూపాయల పరిహారం అందించాలి :

- ఓయూజేఏసీ అధ్యక్షుడు సర్దార్ వినోద్ కుమార్

ముధోల్, నవంబర్ 24: విజన్ ఆంధ్ర : బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థి చల్ల సంపత్ ఆత్మహత్య ఘటన అత్యంత విషాదకరమని, ఈ ఘటన వెనుక ఉన్న వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఓయూజేఏసీ అధ్యక్షుడు సర్దార్ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. విద్యార్థి మృతికి సంబంధించిన అసలు కారణాలను పక్కదారి పట్టించే ప్రయత్నాలు ఆపాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెట్టింగ్ యాప్‌లు, ఆన్‌లైన్ ట్రేడింగ్ వంటి అంశాలను తెరపైకి తెస్తూ ఘటనపై వక్రభాష్యాలు చెబుతున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ వైఖరిని తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల మరణాలపై తరచూ కట్టుకథలు ప్రచారం చేయడంబాధ్యతాయుతమైన వీసీ పదవిలో ఉన్న వ్యక్తికి తగదన్నారు. యూనివర్సిటీలో వరుసగా విద్యార్థుల ఆత్మహత్యలు చోటుచేసుకుంటున్నప్పటికీ, విద్యార్థులకు మానసిక ధైర్యం కల్పించేందుకు కనీసం కౌన్సెలింగ్కేంద్రాన్నిఏర్పాటుచేయకపోవడం విచారకరమన్నారు.విద్యార్థి సంపత్ ఆత్మహత్య చేసుకున్న సమయంలో వీసీ గోవర్ధన్, ఓఎస్డీ మురళీ దర్శన్ యూనివర్సిటీలో అందుబాటులో లేకపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థులకు ధైర్యం చెప్పి భరోసా కల్పించాల్సిన సమయంలో వీసీ అందుబాటులో లేకపోవడం శోచనీయమన్నారు. యూనివర్సిటీని సమర్థవంతంగా నిర్వహించడం చేతకాకపోతే వీసీ తన బాధ్యతల



నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు.చల్ల సంపత్ కుటుంబం నిరుపేద కుటుంబమని, ఆ కుటుంబానికి న్యాయం చేయడానికి ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. అలాగే విద్యార్థి మృతిపై నిష్పక్షపాతంగా, సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని సర్దార్ వినోద్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అర్హుల ఇళ్లను మాయం చేస్తే ఊరుకునేది లేదు!

- మాజీ ఎంపీటీసీ రావుల కల్పన మొగిలి ఆగ్రహం

- ప్రతి కుటుంబానికి ఆర్‌అండ్‌ఆర్, పునరావాస స్థలం ఇవ్వాలని డిమాండ్

మల్హర్, నవంబర్ 24 (విజన్ ఆంధ్ర): మండల కేంద్రమైన తాడిచెర్ల ఓసీపీ బ్లాక్–1కు 500 మీటర్ల డేంజర్ జోన్ పరిధిలో ఉన్న నివాస గృహాల సేకరణ, ఆర్‌అండ్‌ఆర్ పరిహారం, పునరావాసం కోసం సోమవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో అర్హులైన స్థానికుల పేర్లను డ్రాఫ్ట్ డిక్లరేషన్‌లో తొలగించడం పై తాడిచర్ల మాజీ ఎంపీటీసీ రావుల కల్పన మొగిలి మంగళవారం ఒక ప్రకటనలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డుల్లో ఉన్న ఇళ్లను జాబితా నుంచి తొలగించి నిర్వాసితులకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. 2022 పీఎన్‌లో నమోదైన ఇళ్ల సంఖ్యకు, ప్రస్తుత డ్రాఫ్ట్ డిక్లరేషన్‌లో చూపిన ఇళ్ల సంఖ్యకు మధ్య వ్యత్యాసం తగ్గడంపై అధికారుల తీరును ప్రశ్నించారు. ఇంటి పన్ను రసీదులు పేరుతో స్థానికులకు అన్యాయం చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతామని తెలిపారు. గత దశాబ్దకాలంగా ఓసీపీ నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళితో అనేక మంది నిర్వాసితులు అనారోగ్య సమస్యలకు గురయ్యారని, పలువురు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓసీపీ బ్లాస్టింగ్ ప్రభావంతో ఇళ్ల గోడలు బీటలు వారుతున్నాయని, అనేక ఇబ్బందులను భరిస్తూ జీవనం సాగిస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అర్హులైన స్థానికుల పేర్లనే డ్రాఫ్ట్ డిక్లరేషన్‌లో తొలగించడం బాధాకరమన్నారు. సోషల్ ఎకనామిక్ సర్వే పేరుతో ప్రతి స్థానిక నిర్వాసితుడి నుంచి పత్రాలు సేకరించి, చివరకు కేవలం 847 కుటుంబాలనే గుర్తించడం ఏమిటని ప్రశ్నించారు. సర్వేల పేరుతో కాలయాపన చేస్తూ కొండలు తవ్వి ఎలుకను పట్టిన చందంగా అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అధికారులు పునరాలోచించి మానవీయ కోణంలో సర్వేను సమీక్షించి, స్థానిక నిర్వాసితులందరికీ న్యాయం చేయాలని 2026 కటాఫ్ తేది తో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఆర్ అండ్ ఆర్ రెండు గుంటల చొప్పున పునరావాస స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. మంథని మండలం రచ్చవల్లి తరహాలో పునరావాస స్థలాలను అన్ని మౌలిక



సదుపాయాలతో అభివృద్ధి చేసి నిర్వాసితులకు అందించాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం చేయకపోతే భూనిర్వాసితుల తరఫున పెద్ద ఎత్తున ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తామని రావుల కల్పనా మొగిలి హెచ్చరించారు.

తెలంగాణ అంబేద్కర్ ఆదర్శ సంఘం రాష్ట్ర నాయకులకు సన్మానం



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర నవంబర్ 24 : హుస్నాబాద్ నియోజకవర్గం నుండి తెలంగాణ అంబేద్కర్ ఆదర్శ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తొందూరు ఎల్లయ్య, బహుజన్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎన్నికైన కండే సుధాకర్ లు మంగళవారం రోజున సిద్దిపేట జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ సీనియర్ అంబేద్కరిస్టు కేడం లింగమూర్తిని మర్యాద పూర్వకముగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ నియోజకవర్గ ఇన్చార్జి మాట్ల వెంకట్ స్వామి ప్రముఖ పారిశ్రామికవేత్త కోడముంజ మహేందర్ ల ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సన్మానించినారు. హైదరాబాదులో సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన సమావేశంలో తెలంగాణ అంబేద్కర్ ఆదర్శ సంఘం వ్యవస్థాపకులు ఇమ్మడి సంపత్ కుమార్ వీరికి నియామక పత్రాలు అందజేశారు.అందుకుగాను వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇట్టి సన్మాన కార్యక్రమం నిర్వహించిన లింగమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వడ్లూరి తిరుపతి మధునయ్య,తిరుపతి రాజేందర్ లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ జీవిత బీమాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



– కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నందు నాయక్

జన్నారం, నవంబర్ 24 (విజన్ ఆంధ్ర) : ఇందిరమ్మ జీవిత భీమా పథకాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జన్నారం మండల అధ్యక్షులు అజ్మీరా నందు నాయక్ తెలిపారు. మంగళవారం రోజున విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుపేదల సంక్షేమం కోసం మరొక నూతన పథకానికి శ్రీకారం చుట్టి 5 లక్షలతో ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టాడని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు మీ గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో ఇందిరమ్మ జీవిత బీమాకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం ఇప్పటికే ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందని పేర్కొన్నారు. ఇందిరమ్మ జీవిత బీమా కోసం దరఖాస్తు చేసుకునే ప్రజలకు సహకరించేందుకు అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

జాతీయ మాలమహానాడు సిద్దిపేట జిల్లా నూతన కమిటీ ఏర్పాటు జిల్లా అధ్యక్షునిగా ఆరె కిశోర్



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర నవంబర్ 24 : సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన మాలమహానాడు విస్తుతస్థాయి సమావేశంలో జిల్లా నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో ఎన్నుకొని ప్రకటించారు, జిల్లా అధ్యక్షునిగా ఆరె కిశోర్, మరియు వర్కింగ్ ప్రెసిడెంట్ గా చింతల విజయ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులుగా జాజల చందు, మందాల బాబు,కుంభాల రమేష్ అధికార ప్రతినిధిగా ధార స్వామి, కార్యదర్శిలుగా నలుమాల నవీన్, నిమ్మ నితిన్ తుక్కోజి సతీష్, ప్రచార కార్యదర్శి తాండ్ర నరసింహులు, కార్యనిర్వాక కార్యదర్శి తలారి నరసయ్య, యువజనవిభాగం సెక్రెటరీగా గుమ్మడి సాయి శ్రీరామ్ మీడియా సెల్ ఇంచార్జ్ గా పుట్టరాజు,జాల శ్రీనివాస్ గౌరవ అధ్యక్షులుగా మండల యాదగిరి, గుడుమల్ల నత్తయ్యగా నియమించబడ్డారని, పై కమిటీని పూర్తి నిర్వాణ బాధ్యతలు వేయుటకు హక్కులు కల్పిస్తూ నియామకం చేపట్టడం జరిగిందని, జిల్లాలో నిజాయితీగా పనిచేసి ఎక్కడ జాతికి అన్యాయం జరిగిన పోరాడి మాల హక్కుల సాధనలో సిద్దిపేట జిల్లా ముందుండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు మేడి అంజయ్య,వెన్నరాజు, బుట్టి సత్యనారాయణ రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు, రాష్ట్ర సాంస్కృతిక సారధి కన్వీనర్ ఎలుక దేవయ్య, దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ కాల్వ నరేష్, కంబాల రవి,దుండ్ర సుమన్ సుంకే రమేష్ డ్యాగాల సతీష్, దార మల్లయ్య, బండెల గోపాల్, సాయిపరమేశ్వర్ తదితర కుల బాంధవులు పాల్గొన్నారు

మంచిర్యాల ప్రధాన రహదారిపై పశువుల సంచారం..

-వాహనదారులకు తప్పని ఇక్కట్లు

-ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించాలని స్థానికుల వేడుకోలు



నస్పూర్(మంచిర్యాల), నవంబర్ 24 (విజన్ ఆంధ్ర): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని తోళ్ళవాగు సమీపంలో గల ప్రధాన రహదారిపై పశువుల గుంపులు యథేచ్ఛగా సంచరిస్తుండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రధాన మార్గంలో పశువులు రోడ్డుకు అడ్డంగా నిలబడటం, అకస్మాత్తుగా వాహనాలకు అడ్డురావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో చీకటి కారణంగా పశువులు సరిగ్గా కనిపించక, వాటిని తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా పెను ప్రమాదం జరగకముందే మున్సిపల్ మరియు సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. రహదారులపై తిరిగే పశువులను పట్టుకుని సురక్షితంగా గోశాలలకు తరలించాలని, అలాగే పశువులను రోడ్లపైకి వదిలే యజమానులపై తగిన చర్యలు తీసుకొని రాకపోకలకు ఆటంకం కలగకుండా చూడాలని పట్టణ వాసులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా

– ఇందిరమ్మ జీవిత భీమా

- సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్



పోనకల్, నవంబర్ 24 (విజన్ ఆంధ్ర) : ప్రతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ జీవిత భీమా పథకం ధ్వారా ఆర్థిక భరోసా కల్పిస్తుందని సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకానికి గ్రామప్రజలు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాడనికి మంగళ వారం రోజున జన్నారం మండలంలోని పోనకల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ చేతుల మీదుగా ఈ శిబిరాన్ని ప్రారంభించి మొదటి దరఖాస్తును నమోదు చేయించారు.

. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం పూర్తి ఉచితంగా ఈ పథకం ప్రవేశపెట్టి 5 లక్షల భీమా కల్పిస్తుందని కుటుంబ పెద్ద కు ఏదైనా ప్రమాదం జరిగితే ఆ కుటుంబం రోడ్డున పడకుండా ఉండేందుకు ఈ పథకం భరోసా ఇస్తుందని తెలిపారు. 18 నంవత్సరాల వయస్సు నుంచి 59 నంవత్సరాలలోవు వారందరూ ఈ పథకానికి అర్హులే అని అంతేకాకుండా భీమా పథకానికి దరఖాస్తు చేసుకునే వారికి నామినిగా ఒక్కరినే కాకుండా ఇద్దరు లేదా ముగ్గురు నామినీలను సైతం పెట్టుకునే వెసులుబాటు వుందని ఆమె తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్ర మంలో ఉప సర్పంచ్ అప్పల జలపతి, మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ ఫసి ఉల్లా, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉ పాధ్యక్షులు మోహన్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు మంద రాజేష్, వార్డు సభ్యులు పిల్లి మల్లయ్య , మర్రిపెల్లి అంజన్న, రాథోడ్ సంతోష్, మోసిన్ ఖాన్ షా, సొడం రవిలతో పాటు నాయకులు రజాక్, ప్రవీణ్, నర్సింగరావు, రాగుల శంకర్, ప్రేంసాగర్, పంచా యతీ కార్యదర్శి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ పనితీరుపై
సీపీ సమీక్ష..

-సిబ్బందికి దిశానిర్దేశం
- పోలీసు స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన రష్మీ పెరుమాల్

కుకునూరుపల్లి, నవంబర్ 24, విజన్ ఆంధ్ర: కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్‌ను సీపీ రష్మి పెరుమాల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని వివిధ పోలీసు రికార్డులను పరిశీలించి, స్టేషన్ నిర్వహణ, శాంతిభద్రతల పరిస్థితిపై సమీక్షించారు. అనంతరం పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో జరిగే సంఘటనలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ముందస్తు చర్యలు తీసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్సై బాలకృష్ణ పుష్పగుచ్ఛం అందించి సీపీకి స్వాగతం పలికారు. కార్యక్రమంలో తొగుట సీఐ శ్రీనివాస్, ఎస్సై బాలకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ ఆధ్వర్యంలో క్యాంప్ ఫైర్

బోథ్, నవంబర్ 24. విజన్ ఆంధ్ర బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం బోథ్ అటవీ రేంజ్ పరిధిలోని కుంటాల సోమన్న హరితవనం (అర్బన్ పార్క్) లో ఫైర్ క్యాంప్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు షేక్ అలీ మాట్లాడుతూ యాంత్రిక జీవనం నుండి తాత్కాలికంగానైనా ఉపశమనం పొందాలనుకునే వారికి ఆదిలాబాద్ జిల్లా బోథ్ ప్రాంతంను చిరునామా గా మార్చాలనే ఉద్దేశ్యంతో బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ నీ ఏర్పాటు చేశామని అన్నారు. అటవీ శాఖ అనుమతితో తమ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా పర్యాటకుల సంఖ్యను పెంచి స్థానికులకు ఉపాధి అవకాశాలను కల్పించడమే తమ ఉద్దేశ్యమని అన్నారు. ఈ ఫైర్ క్యాంప్ లో రాత్రి పూట అటవీ ప్రాంతంలో టెంట్లలో బస చేయడం, క్యాంప్ ఫైర్, నక్షత్రాలను వీక్షించడం, అటవీ ప్రాంతాల్లో ట్రెక్కింగ్, సూర్యోదయ, సూర్యాస్తమయ దృశ్యాలను ఆస్వాదించడం ఉన్నాయని అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ ప్రాంత అందాలను, ఇక్కడి జలపాతాలను, ప్రకృతి వైవిధ్యాన్ని, విన్నమైన వృక్ష, జంతు జాతులను ప్రపంచానికి తెలియజేయాలనే ఉద్దేశ్యంతో బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ నీ ఏర్పాటు చేశామని అన్నారు.



ఇప్పటికే తమ సొసైటీ ఆధ్వర్యంలో అటవీ శాఖ సౌజన్యంతో అనేక పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను చేపట్టామని, రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలను చేపడుతామని అన్నారు.

బెజగామలో ఘనంగా 'ఇందిరమ్మ బీమా పథకం' కార్యక్రమం

- రూ. 5 లక్షల బీమాతో కుటుంబాలకు ధీమా..
- సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శం
- 18 నుండి 59 ఏళ్ల లోపు వారందరికీ ఇందిరమ్మ బీమా రక్షణ
- బెజగామ గ్రామ సర్పంచ్ నక్కిర్త గోపాల్

గజ్వేల్ నియోజకవర్గం, 24 నవంబర్ 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బెజగామ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నక్కిర్త గోపాల్ ఆధ్వర్యంలో 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ ఎంపీడీవో మహేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ నక్కిర్త గోపాల్ మాట్లాడుతూ.. గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 18 నుండి 59 సంవత్సరాల వయసు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ బీమా పథకం ద్వారా 5 లక్షల వరకు లబ్ధి పొందవచ్చని ఆయన వివరించారు. తెలంగాణ



రాష్ట్ర ముఖ్యమంత్రి నాయకత్వంలో సాగుతున్న 'ప్రజాపాలన'లో భాగంగా, పేద మరియు మధ్యతరగతి ప్రజలకు నేరుగా ఉపయోగపడే సంక్షేమ పథకాలను ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం నేడు దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన పట్ల రాష్ట్ర ప్రజలందరూ ఎంతో సంతోషంగా ఉన్నారని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలు తోడుదొంగలు..

- ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు
- పాదయాత్రల పేరిట బీజేపీ కుల మత రాజకీయాలు..
- సంక్షేమ పథకాల ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది
- ప్రజలందరూ కేసీఆర్ వైపే.. మళ్లీ వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే
- గజ్వేల్ బిఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి



గజ్వేల్, 24 నవంబర్ 2026 (విజన్ ఆంధ్ర) : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రెండూ తోడుదొంగలని, అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేసి ప్రజలను మోసం చేస్తున్నాయని గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రూ. 5 లక్షల కోట్ల అప్పులు చేసిందే తప్ప, ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదని వంటేరు ప్రతాప్ రెడ్డి ఆరోపించారు. కనీసం తట్టెడు మన్ను కూడా తీయలేదని, రేవంత్ రెడ్డి బహిరంగ సభల్లో కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ తెచ్చిన కరువుతో రైతులు అల్లాడుతున్నారని, ఇప్పటివరకు వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం దారుణమని అన్నారు. బిఆర్ఎస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులలో నీళ్లు నింపడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పాదయాత్రల పేరిట బీజేపీ కులమత రాజకీయాలు చేస్తోందని ఆయన మండిపడ్డారు. తెలంగాణ ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వకుండా, రీజనల్ రింగ్ రోడ్డును పూర్తి చేయకుండా ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలని కేంద్రం, 2 లక్షల ఉద్యోగాలని రాష్ట్ర ప్రభుత్వం యువతను మోసం చేశాయని అన్నారు. కేంద్ర పాలనలో పెట్రోల్, డీజిల్, బంగారం, నిత్యావసర ధరలు పెరిగి సామాన్యులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. 24 గంటల కరెంట్, రైతుబంధు, కళ్యాణ లక్ష్మి, రైతు బీమా, కేసీఆర్ కిట్, దళిత బంధు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని యాత్రలు చేసినా రాష్ట్ర ప్రజలందరూ కేసీఆర్ వైపే ఉన్నారని, మళ్లీ అధికారంలోకి వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్.సి రాజమౌళి, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, రాష్ట్ర ఎంపీటీసీల వర్కింగ్ మాజీ ప్రెసిడెంట్ దేవి రవీందర్, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, కొండపాక మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి, మద్ది రాజిరెడ్డి, తూప్రాన్ మాజీ జెడ్పిటిసి రాణి సత్యనారాయణ గౌడ్, గంగిశెట్టి రవీందర్, కుమ్మరి రఘుపతి, దుర్గాప్రసాద్, ప్రభాకర్, అహ్మద్, నిజం, శ్యామ్ తదితరులున్నారు.

ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వరా?



- దేవస్థానం ఎవరి సొంత జాగీరు కాదు..

- ఆలయ చైర్మన్, డైరెక్టర్లు సమాధానం చెప్పాలి!

- ఆలయ పాలకమండలి తీరుపై నిరసనల వెల్లువ

- కొండాపోచమ్మ ఆలయం ముందు భారీ రాస్తారోకో

గజ్వేల్ నియోజకవర్గం, 24 నవంబర్ 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా తీగుల్ నర్సాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ కొండాపోచమ్మ దేవస్థానం 25వ వార్షికోత్సవ ఆహ్వాన పత్రికలో స్థానిక దళిత సర్పంచ్ పేరును విస్మరించడాన్ని నిరసిస్తూ సోమవారం ఆలయం ముందు వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజల ఓట్లతో ఎన్నికైన దళిత ప్రజాప్రతినిధికి కనీస గౌరవం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యానికే అవమానమని మండిపడ్డారు. దేవాదాయ శాఖ పరిధిలోని దేవస్థానం ఎవరి వ్యక్తిగత జాగీరు కాదని, స్థానిక సర్పంచ్ పేరును ఆహ్వాన పత్రికలో ఎందుకు చేర్చలేదో ఆలయ చైర్మన్, డైరెక్టర్లు ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆహ్వాన పత్రికలో సర్పంచ్ పేరు విస్మరించడంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ పాలకమండలి (చైర్మన్, డైరెక్టర్ల) బాధ్యతను ఉన్నతాధికారులు పరిశీలించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దేవాదాయ శాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలన్నారు. జిల్లా కలెక్టర్, దేవాదాయ శాఖ అధికారులు తక్షణమే స్పందించి బాధ్యులను శిక్షించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ సర్పంచ్ పోసాన్ పల్లి రాజు, పీర్లపల్లి సర్పంచ్ ఓంప్రకాష్, కుమార్ మాదిగ సంఘాల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాదిగ జేఏసీ మండల అధ్యక్షులు మాసపాక యాదగిరి, యంయస్పి మండల అధ్యక్షులు జే హరిబాబు, నీరుడిస్వామి మాలమానాడు రాష్ట్ర కార్యదర్శి, కొడకండ్ల నర్సింలు, సామాజిక హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు, యంయస్పి మండల ఉపాధ్యక్షులు మాచర్ల రాంచంద్రం, ఏంఆర్పిఎస్ మండల ఉపాధ్యక్షులు స్వామి, రతన్, చాట్లపల్లి ఉపసర్పంచ్, లింగారి కరుణాకర్, ప్రజాసంఘాల నాయకులు, ఏంఆర్పిఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లను వెంటాడుతున్న వివాదాలు..

- కుకునూరుపల్లిలో ఇదేం విచిత్రం!

- మండలం ఏర్పడినప్పటి నుంచి మారుతున్న అధికారులు..

- మారని వివాదాల చర్చ!



కుకునూరుపల్లి, నవంబర్ 24, విజన్ ఆంధ్ర: కుకునూరుపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం చుట్టూ వివాదాల చర్చ ఎప్పుడూ ఏదో ఒక రూపంలో వినిపిస్తూనే ఉంది. మండలం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహించిన తహసీల్దార్లలో ఆశాజ్యోతి, దండి సుజాత, ప్రస్తుతం వేణుగోపాల్ రావు.. ఇలా ఒక్కొక్కరి హయాంలో ఏదో ఒక అంశం చర్చనీయాంశంగా మారుతోంది. అయితే మల్లికార్జున రెడ్డి మాత్రం వివాదాలకు దూరంగా ఉన్న అధికారిగా గుర్తుండిపోయారు. అధికారులు మారుతున్నారు.. కానీ వివాదాల చర్చ మాత్రం ఎందుకు ఆగడం లేదన్న ప్రశ్న స్థానికంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇది కార్యాలయ వాస్తు గండమా? లేక రెవెన్యూ శాఖలోని పనుల ఒత్తిడి, స్థానిక సమస్యలు, పరిపాలనా నిర్ణయాల ప్రభావమా? అన్న చర్చ కూడా వినిపిస్తోంది. ఏదేమైనా, ఒక కార్యాలయం చుట్టూ పదేపదే వివాదాలు తెరపైకి రావడం కంటే ప్రజలకు పారదర్శకమైన సేవలు అందడం ముఖ్యం. వివాదాలకు తావులేని పాలనతో కుకునూరుపల్లి తహసీల్దార్ కార్యాలయం ప్రజల్లో విశ్వాసం పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ

- మంచిర్యాల జిల్లా నూతన నియామకాలు




మంచిర్యల (క్రైమ్), నవంబర్ 24: సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ మంచిర్యాల కమిటీని బలోపేతం చేసే దిశగా నూతన నియామకాలు చేపట్టినట్లు జిల్లా అధ్యక్షులు డా. పెద్దల్ల చంద్రకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ అధ్యక్షులు శ్రీ జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, జాతీయ కార్యనిర్వహక కార్యదర్శి గాడిచర్ల శ్రీనివాస్ ఆదేశాలు, జాతీయ ఉపాధ్యక్షులు ఏటీ ఆంజనేయులు సూచనలు మరియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎరిగేండ్ల వెంకటేష్ ముదిరాజ్ నిర్ణయం మేరకు జిల్లా ఉపాధ్యక్షులు భూక్యా బీమా శేఖర్ నాయక్ సహకారంతో ఈ నియామకాలు జరిగాయి. జిల్లా ప్రధాన కార్యదర్శి సిరిపురం రాజేశం (రామారావుపేట, జైపూర్ మండలం), జిల్లా కార్యదర్శి లంబు జైపాల్ రెడ్డి (కిష్టాపూర్), ప్రజల్లో సమాచార హక్కు చట్టం–2005 (RTI) ద్వారా ప్రభుత్వ నిధుల వినియోగం, పంచాయతీ లెక్కలు, సంక్షేమ పథకాల అమలు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు మరియు ఉపాధి హామీ పనుల వివరాలను చట్టబద్ధంగా తెలుసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించడం. జిల్లాలోని ప్రతి గ్రామం, మండలం, నియోజకవర్గ స్థాయిల్లో యువత, సామాజిక కార్యకర్తలతో కమిటీలను ఏర్పాటు చేయడం. RTI దరఖాస్తులు రాయడం, అప్పీళ్లు చేయడం వంటి అంశాలపై ప్రజలకు ఉచితంగా శిక్షణ, నమూనా పత్రాలను అందించడం. ప్రభుత్వ నిధుల దుర్వినియోగం, అక్రమాలపై వాస్తవ ఆధారాలతో ప్రశ్నిస్తూ అవినీతి నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలని డా. పెద్దల్ల చంద్రకాంత్ పిలుపునిచ్చారు. నూతన నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

గ్రామపంచాయతీ ఉద్యోగుల సమస్యలపై ఐ ఎన్ టి యు సి తో కీలక చర్చలు

- ఐఎన్ టి యు సి నాయకుల హామీ

- తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ యునైటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు

- సాదుల శ్రీకాంత్, ఆధ్వర్యంలో



మల్హర్ నవంబర్ 24 (విజన్ ఆంధ్ర): హైదరాబాద్, నవంబర్ 24 తెలంగాణ రాష్ట్రంలోని గ్రామపంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కారోబార్లు, బిల్ కలెక్టర్లు, ఇతర గ్రామపంచాయతీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఐ ఎన్ టి యు సి ముఖ్య నాయకులు హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని జలసౌధ ఐ ఎన్ టి యు సి కార్యాలయంలో గ్రామపంచాయతీ ఉద్యోగుల సమస్యలు, పెండింగ్ డిమాండ్లు, హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత తదితర అంశాలపై కీలక చర్చలు నిర్వహించారు. తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ యునైటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సాదుల శ్రీకాంత్, ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఐ ఎన్ టి యు సి ముఖ్య ఉపాధ్యక్షులు మొగిల్లా రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగయ్య, గౌడ్‌లను కలిసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఐ ఎన్ టి యు సి నాయకులు స్పందిస్తూ గ్రామపంచాయతీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సంబంధిత ప్రభుత్వ పెద్దలతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఉద్యోగుల హక్కుల సాధన, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం ఐ ఎన్ టి యూ సి ఎల్లప్పుడూ అండగా నిలిచి పోరాటం చేస్తుందని భరోసా ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి ముందుకొచ్చి భరోసా కల్పించిన ఐ ఎన్ టి యు సి ముఖ్య నాయకులకు తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ యునైటెడ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం తరఫున అధ్యక్షులు సాదుల శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ నభ్యులు దొంతుల నత్యం, తోలుకునూరి అశోక్, మేదరి రాజేందర్, నాగనబోయిన శ్రీనివాస్, గౌడ రాజమహేందర్, నాగరాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అర్హులందరూ ఇందిరమ్మ బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

- సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్

దౌల్తాబాద్,నవంబర్24(విజన్ ఆంధ్ర): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ బీమా పథకానికి సంబంధించి కొనాయిపల్లి గ్రామంలో ధరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమైంది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి అర్హులైన గ్రామస్తుల నుంచి బీమా ధరఖాస్తులను స్వీకరించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ బీమా పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన అర్హులైన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ అవసరమైన వివరాలతో ధరఖాస్తు చేసుకుని పథకంలో నమోదు చేసుకోవాలని కోరారు. గ్రామంలోని అర్హులైన వారందరికీ పథకంపై అవగాహన కల్పించి, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు

-వీర హనుమాన్ శివాలయంలో ప్రత్యేక పూజలు.
-శివనామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం
-దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్న మహిళలు



మెదక్ /రేగోడు నవంబర్ 24(విజన్ ఆంధ్ర): మండల కేంద్రమైన రేగోడ్‌లో కార్తీక పౌర్ణమి వేడుకలు భక్తిపారవశ్యంతో ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి స్థానిక వీర హనుమాన్ శివాలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని భక్తి శ్రద్ధలతో దీపాలు వెలిగించి శివుడికి పూజలు చేశారు. దీపకాంతులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కార్తీక మాసంలో అత్యంత పవిత్రమైన రోజుగా భావించే పౌర్ణమి సందర్భంగా శివనామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. భక్తులు శివుడిని దర్శించుకొని కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు

వాహనాల తనిఖీలు నిర్వహించిన ఎస్ఐ పోచయ్య

- నకిలీ నెంబర్ ప్లేట్లపై కఠిన చర్యలు



మెదక్ /రేగోడ్ నవంబర్ 24(విజన్ ఆంధ్ర): మెదక్ జిల్లా ఎస్పీ డి.శ్రీనివాసరావు సూచనల మేరకు రేగోడు పోలీస్ స్టేషన్ పరిధిలోని బసవేశ్వర చౌరస్తా వద్ద మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీలు నిర్వహించారు. నకిలీ నెంబర్ ప్లేట్ మార్పులు చేసిన,స్టిక్కర్ ఆధారిత, డూప్లికేట్ లేదా అస్పష్టంగా కనిపించే నంబర్ ప్లేట్లను వాహనాలపై అమర్చడం చట్టవిరుద్ధమని రేగోడు ఎస్ఐ పోచయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆమోదించిన హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లను ఉపయోగించడం ద్వారా వాహనాల అసలు గుర్తింపును దాచడం,ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం,నేర కార్యకలాపాలకు సహకరించే అవకాశం ఉన్నందున ఇటువంటి ఉల్లంఘనలను పోలీసులు అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నారని పేర్కొన్నారు. నకిలీ లేదా అనధికారిక నెంబర్ ప్లేట్లతో సంచరించే వాహనాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు,అవసరమైతే వాహనాలను స్వాధీనం చేసుకుని అమల్లో ఉన్న చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసుతోపాటు జైలు శిక్ష తప్పదని మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన రిజిస్టర్ ఓనర్ పై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అన్ని వాహన యజమానులు తమ వాహనాలకు ప్రభుత్వం ఆమోదించిన హెచ్.ఎస్.ఆర్.పి నంబర్ ప్లేట్లు మాత్రమే అమర్చుకున్నట్లు వెంటనే ధృవీకరించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ నిబంధనలను పాటిస్తూ,ట్రాఫిక్ నియమాలను గౌరవించి పోలీసులకు సహకరించాలని అన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి టి.యు.డబ్ల్యూ.జే - ఐ.జే.యు కృషి

- మెదక్ జిల్లా అధ్యక్షులు శంకర్ దయాల్ చారి



మెదక్ /రేగోడు నవంబర్ 24 (విజన్ ఆంధ్ర): జర్నలిస్టుల సంక్షేమానికి టి.యు.డబ్ల్యూ.జే – ఐ.జే.యు ఎల్లవేళల కృషి చేస్తుందని మెదక్ జిల్లా యూనియన్ అధ్యక్షుడు శంకర్ దాయల్ చారి అన్నారు. మంగళవారం నాడు రేగోడు మండల కేంద్రంలో టి.యు.డబ్ల్యూ.జే.ఐ.జే.యు యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయించాలని, హెల్త్ కార్డులను మంజూరు చేయాలని ప్రస్తుత వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. మన రేగోడ్ మండల జర్నలిస్టులకు వెంటనే ఇళ్లస్థలాలు కేటాయించాలని అలాగే. జర్నలిస్టుల హెల్త్ కార్డ్స్ ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానాల్లో పని చేసే విధంగా కృషి చేయాలని వారన్నారు. ప్రజలకు – ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న జర్నలిస్ట్ ల విషయంలో ఏ ప్రభుత్వం వచ్చిన కూడా జర్నలిస్ట్ లకు న్యాయం చేయడం లేదని అన్నారు. రానున్న రోజుల్లోనైన ప్రభుత్వం స్పందించి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే తీర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రేగోడ్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు శంకర్ గౌడ్,సంయుక్త కార్యదర్శులు ఆనంద్,రాజు,మండల జర్నలిస్టులు విట్టల్ రావు,గున్న ప్రభాకర్ గుప్తా,సంతోష్ కుమార్,షాహద్ అలీ, సుభాస్ గౌడ్,చంద్రమోహన్,షపి, గంజి శుభాష్,పూర్ణ చందర్,బ్రహ్మం చారి,నాగభూషణం,వడ్ల సంతోష్,మతీన్,ముబీన్,శాంరాయినోళ్ళ సంతోష్ రావు,వినయ్ కుమార్,ఆంజనేయులు,శివ కుమార్,రమేష్ చారి,శ్రీనాథ్ చారి,యాదయ్య,ప్రసాద్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన ప్రజా వీరుడు పండుగ సాయన్న - శాసన సభాపతి

పరిగి నియోజకవర్గం గండీడ్ మండలంలోని పలు గ్రామాల్లో పండుగ సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

కొమిరెడ్డిపల్లి గ్రామంలో పండుగ సాయన్న విగ్రహాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారు, పరిగి ఎమ్మెల్యే శ్రీ టి. రామ్మోహన్ రెడ్డి గారు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ శ్రీ బండా ప్రకాష్ గారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ గారు, మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి గారు, యువకులు, గ్రామస్తులు, వివిధ మండలాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంతకుముందు నంచర్ల గ్రామం నుంచి కొమిరెడ్డిపల్లి వరకు బైక్ ర్యాలీ సాగింది. ఈ బైక్ ర్యాలీలో యువత ఉత్సాహంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆ తర్వాత వెన్నచేడ గ్రామంలో పండుగ సాయన్న విగ్రహాన్ని గౌరవ శాసన సభాపతి, వికారాబాద్ శాసనసభ్యులు శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారు, పరిగి ఎమ్మెల్యే శ్రీ టి. రామ్మోహన్ రెడ్డి గారు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ శ్రీ బండా ప్రకాష్ గారు ఆవిష్కరించారు.

విగ్రహ ఆవిష్కరణ తర్వాత పండుగ సాయన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయనను స్మరించుకుంటూ స్పీకర్ గారు మాట్లాడారు.

ఈ సందర్భంగా స్పీకర్ గారు మాట్లాడుతూ పండుగ సాయన్న గారు ధనవంతులు, భూస్వాముల దగ్గర నుంచి భూములను లాక్కుని పేద ప్రజలకు పంచారు. ఎన్నో దాన ధర్మాలు చేశారు.

పేదల భూములు లాక్కుంటే, ఆడబిడ్డలను అవమానిస్తే సహించలేక పోరాడిన గొప్ప వ్యక్తి. ఆయన్ను కొందరు బందిపోటు అన్నారు. కానీ పేద ప్రజలు మాత్రం ఆయన్ను తెలంగాణ రాబిన్ హుడ్ అని గుండెల్లో పెట్టుకున్నారు. బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన ప్రజా వీరుడు పండుగ సాయన్న గారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రజా ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది అని స్పీకర్ గారు గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మండల నాయకులు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డ్రగ్స్ మహమ్మారితో దేశ ఉనికికే ముప్పు: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 24 (విజన్ ఆంధ్ర) : నషా ముక్త భరత్ కార్యక్రమానికి రేపు (బుధవారం) హైదరాబాద్ వేదిక కానుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. డ్రగ్స్ మహమ్మారితో దేశ ఉనికికే ముప్పు ఉందని హెచ్చరించారు. దేశంలో డ్రగ్స్ ఫ్రీ ఉండటానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. రాజకీయాల గురించి తర్వాత మాట్లాడుదామని తెలిపారు.

డ్రగ్స్ తీసుకున్న వారిపై కఠినంగా ఉండాలి..

దేశ ప్రజల ఉనికితో కూడిన సమస్య ఇదని కిషన్‌రెడ్డి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన కార్యక్రమం కాదని.. ప్రతి పౌరుని బాధ్యత అని తెలిపారు. డ్రగ్స్ మహమ్మారిన పడి పంజాబ్ రాష్ట్రం ఉనికి కోల్పోయే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో డ్రగ్స్ తీసుకున్న వారిపై కఠినంగా ఉంటామని చెప్పారని అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా డ్రగ్స్‌పై పోరాడాలని తెలిపారు. రాజకీయాలు పక్కన పెట్టి డ్రగ్స్ రహిత హైదరాబాద్, డ్రగ్స్ రహిత తెలంగాణ , డ్రగ్స్ రహిత దేశాన్ని నిర్మించుకుందామని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

చౌటకూర్‌లో వైభవంగా కార్తీక దీపోత్సవం..

– కన్నులపండువగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



చౌటకూర్, నవంబర్ 24 (విజన్ ఆంధ్ర):- పవిత్ర కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని చౌటకూర్ మండల కేంద్రంలోని శ్రీ శ్రీ శ్రీ అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం కార్తీక దీపోత్సవ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు.

తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తడంతో ఆలయ ప్రాంగణమంతా శివనామస్మరణతో మార్మోగింది. అర్చకులు స్వామివారికి, అమ్మవారికి వేదమంత్రాల నడుమ పంచామృత అభిషేకాలు, బిల్వార్చనలు మరియు ప్రత్యేక అలంకరణలు చేశారు. సాయంత్రం వేళ మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయ ప్రాంగణంలో మట్టి ప్రమిదలతో కార్తీక దీపాలను వెలిగించారు. వేలాది దీపాల కాంతులతో ఆలయ పరిసరాలు దేదీప్యమానంగా వెలిగిపోతూ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

కన్నులపండువగా కల్యాణ మహోత్సవం:దీపోత్సవం అనంతరం గ్రామస్థులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, పండితుల వేదమంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి కల్యాణ ఘట్టం కన్నులపండువగా సాగింది. కల్యాణం అనంతరం స్వామివారికి మహా నైవేద్యాలు సమర్పించి, హాజరైన భక్తులందరికీ తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ వేడుకలను తిలకించేందుకు చౌటకూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, గ్రామ పెద్దలు మరియు యువకులు కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కరుణామయుడైన ఆ పరమేశ్వరుని ఆశీస్సులతో పాడిపంటలు బాగా పండి, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

జర్నలిస్ట్ జగన్ కుటుంబానికి టీడబ్ల్యూజేఎఫ్ బాసట

- కుటుంబానికి రూ.1.12 లక్షల ఆర్థిక సహాయం అందజేత
- జగన్ కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటాం
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ పి.రాంచందర్
- కడు పేదరికంలో పుట్టిన కుటుంబాన్ని మానవతా వాదులు ఆదుకోవాలి
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య
- ఆపదలో అండగా నిలిచిన టీడబ్ల్యూజేఎఫ్ నాయకులకు వెల్లువెత్తిన అభినందనలు



ఇబ్రహీంపట్నం, నవంబర్ 24 (విజన్ ఆంధ్ర) : రంగారెడ్డి జిల్లా మంచాల మండలానికి చెందిన నవతెలంగాణ దినపత్రిక రిపోర్టర్ జగన్ ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం జర్నలిస్టు లోకానికి తీరని లోటుగా మారింది. మంగళవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శేరిబాయ్ గణేష్, జిల్లా కార్యదర్శి మైల సైదులు, ఇబ్రహీంపట్నం డివిజన్ అధ్యక్షుడు సిలువేరు యాదగిరి, డివిజన్ కమిటీ నేతృత్వంలో రాష్ట్ర నాయకత్వం పల్లాటి జగన్ కుటుంబాన్ని పరామర్శించి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. కుటుంబ సభ్యులకు రూ.1 లక్షా 12 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ పి.రాంచందర్, ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య మాట్లాడుతూ... జగన్ కుటుంబం ఒంటరిది కాదని, జర్నలిస్టుల సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జగన్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకునేందుకు తమ సంఘం నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల కుటుంబాలకు కష్టకాలంలో అండగా నిలవడం సంఘం బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. జగన్ చిన్ననాటి నుంచే పేదరికంలో పుట్టి అనేక ఆర్థిక ఇబ్బందులు, ఒడిదుడుకులను ఎదుర్కొంటూ జీవితంలో ముందుకు సాగారని గుర్తుచేశారు. విద్యార్థి, యువజన సంఘాల్లో పనిచేస్తూ ప్రజా సమస్యలపై పోరాటం చేశారని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతతో ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటూ, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేసిన వ్యక్తి జగన్ అని కొనియాడారు. జర్నలిస్టు వృత్తిని కేవలం ఉపాధిగా కాకుండా ప్రజాసేవకు ఒక వేదికగా భావించి పనిచేశారని నాయకులు గుర్తుచేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన వార్తల ద్వారా వెలుగులోకి తీసుకువచ్చి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. నిరుపేదలు, సామాన్య ప్రజల గొంతుకగా నిలుస్తూ తనదైన ముద్ర వేసుకున్నారని అన్నారు. జగన్ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ప్రజల కోసం ఆయన చేసిన సేవలు, సమాజం పట్ల ఆయనకున్న నిబద్ధత ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. ఆయన జ్ఞాపకాలు, ప్రజా సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. ఒక జర్నలిస్టు కుటుంబం ఆపదలో ఉన్నప్పుడు తోటి జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాలు అండగా నిలవడం ఎంతో అవసరమని ఈ సందర్భంగా నాయకులు అభిప్రాయపడ్డారు. జగన్ కుటుంబానికి అందించిన రూ.1.12 లక్షల ఆర్థిక సహాయం ఆ కుటుంబానికి కొంతైనా ఊరటనిస్తుందని, భవిష్యత్తులోనూ కుటుంబానికి అవసరమైన సహాయ,సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జగన్ ఆశయాలు, ప్రజా సేవా స్ఫూర్తి కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు పేర్కొన్నారు. కడు పేదరికంలో పుట్టిన జగన్ కుటుంబాన్ని మానవతా వాదులు ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ నాయకులకు నియోజకవర్గ వ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తాయి. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిగే రఘు, కార్యదర్శులు రాజశేఖర్, జగదీష్, నిరంజన్, సీనియర్ నాయకులు హాసిమ్, సీనియర్ జర్నలిస్ట్ జోగు శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు పి.వెంకటేష్, మణికుమార్, క్రాంతి, అంజి, సహాయ కార్యదర్శి ఎర్ర లింగం, ఉపాధ్యక్షులు కందుకూరి నగేష్, పంది శ్రీను, శివ, దేవరాజు, బాలరాజు, గిరికాంత్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.



సిద్దుల గుట్ట కార్తీక పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షణ

ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా నవంబర్ 24 (విజన్ ఆంధ్ర) : ఆర్మూర్ పట్టణ కేంద్రాల్లోని శ్రీ నవనాథ సిద్దుల గుట్ట. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈరోజు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రముఖ సీనియర్ న్యాయవాది పీసీసీ మాజీ కార్యదర్శి ఖండేశ్ శ్రీనివాస్ గారు గిరి ప్రదక్షణ చేశారు.

కార్తిక పౌర్ణమి శుభ సందర్భంలో రెండవ అరుణాచలం గా పిలువబడే ఆర్మూర్ లోని అత్యంత ప్రసిద్ధ గాంచిన పుణ్య క్షేత్ర మైన శ్రీ నవనాధుల సిద్దుల గుట్ట కు ఈ రోజు ఎంతో పవిత్రమైన రోజని అన్నారు ఆయన తోపాటు అయ్యప్ప స్వాములు భక్తులు తదితరులు గిరి ప్రదక్షణలో పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతు నట్టేట మునిగాడు శ్రీనివాస్ రెడ్డి

ఆర్మూర్ నిజామాబాద్ జిల్లా నవంబర్ 24 (విజన్ ఆంధ్ర) : ఆర్మూర్ నియోజవర్గంలోని ఇస్సపల్లిలో బిజెపి కిషన్ మోర్చా రాష్ట్ర ఉ పాధ్యక్షులు నూతల శ్రీనివాస్ రెడ్డి వడ్ల కుప్పలను పరిశీలించి రైతులతో మాట్లాడాడు ఇటీవల వరకు రూ. 3300 నుంచి రూ. 3,800 వరకు ఉన్న వడ్ల ధర నేడు రూ. 2600-2700 కు పడిపోయిందని క్వింటాల్కు రూ 250-350 రైతు నష్టపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు కొనుగోలు కేంద్రాల్లో బస్తాలు తూకాలు లేక రైతులు దళారులకు అమ్మాల్సి వస్తుందని అన్నారు వెంటనే రూ. 3000 కు తగ్గకుండా వడ్లను కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రైతులు వరి హార్వెస్టింగ్ వచ్చినప్పుడు మిల్లర్స్ లో తనిఖీలు పేరు మీద సిఐడి ఎంక్వైరీ పేరు మీద 3800 వరకు ఉన్నటు వంటి బయట రాష్ట్రాల వ్యాపారస్తులు వారిని రాని వ్వకుండా ఇక్కడే ఉన్నటువంటి వ్యాపారస్తులు కొనుగోలు చేయకుండా రైతులని అనేక రకాలుగా నట్టేట ముంచుతున్నటువంటి ఈ రాష్ట్ర ప్రభుత్వం ఎందుకంటే ఈరోజు వరకు కూడా ఆర్మూర్ బాల్కొండ మరియు జగిత్యాల్ జిల్లా గాని నిర్మల్ జిల్లా గాని రాష్ట్రంలో చాలా జిల్లాలలో రైతులు బోనస్తా కలిపి 2971 మద్దతు ధర వస్తుందని అనుకున్న రైతులకు ఇప్పటివరకు కొనుగోలు సెంటర్లో అమాలి లేరు కానీ బ్యాగులు లేవు కొనుగోలు లేవు ఈ రోజు ఇస్సపల్లి వడ్ల దగ్గర నుంచి జిల్లా



నష్టపోతారు ప్రభుత్వం ఇప్పటికి కొనుగోలు చేసే సెంటర్లో తూకాలు వేయకపోవడానికి కారణం రైతులు గత్యంతరం లేక దళారుల కు అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని దీనంతటికీ ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు బాధ్యులు కనుక వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కల్పించుకొని వ్యవసాయ అధికారులని రంగంలోకి దింపి రైతన్నకి 3000 వేల రూపాయలకు తగ్గకుండా వడ్లు కొనుగోలు చేసే విధంగా చూడవలసిందిగా ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని భారతీయ జనతా కిషన్ మోర్చా రాష్ట్ర ఉ పాధ్యక్షులు నూతుల శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు.

అనుమతుల పేరుతో పెద్ద ఎత్తున ఇసుక రవాణా..!

- అడ్డుకున్న గ్రామస్తులు
- అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్

సాలుర, నవంబర్ 24 (విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ జిల్లా సాలూరా మండలం తగెల్లి గ్రామంలో అనుమతుల పేరుతో పెద్ద ఎత్తున ఇసుకను తరలిస్తుండటంపై గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తు మంగళవారం ఇసుక ట్రాక్టర్ లను అడ్డుకున్నారు. గ్రామం మధ్య నుంచి భారీ వాహనాలు వెళ్లడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవేళ ఏదైనా ప్రమాదం జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. అంతేకాకుండా, నీటి కొరత కారణంగా బోర్‌వెల్ వేయాలన్నా ప్రభుత్వం అనుమతి తీసుకోవాలని నిబంధనలు విధిస్తుండగా, మరోవైపు మంజీరా నది నుంచి పెద్ద ఎత్తున ఇసుకను తవ్వడం వల్ల భూగర్భ జలాలు తగ్గిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. దీనివల్ల భవిష్యత్తులో గ్రామాల్లో నీటి సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఇసుక రవాణాకు సంబంధించిన అనుమతులు ఎప్పటి వరకు చెల్లుబాటులో ఉంటాయి, ఎన్ని రోజులపాటు అనుమతి ఇచ్చారు, నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే అంశాలపై విచారణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, భారీ వాహనాలు గ్రామం మధ్య నుంచి కాకుండా గ్రామం వెలుపలి నుంచి వెళ్లేందుకు ప్రత్యేక రవాణా మార్గాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కార్తీక పౌర్ణమివేళ బుగ్గరామలింగేశ్వరుడి సేవలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

-స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం, నవంబర్ 24 (విజన్ ఆంధ్ర) : కార్తీక పౌర్ణమి తొలిరోజు మంగళవారం ఆరుట్ల గ్రామ సమీపంలో వైభవంగా ప్రారంభమైన శ్రీ బుగ్గరామలింగేశ్వరస్వామి జాతరలో ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. జాతర తొలిరోజున వేలాదిగా తరలివచ్చిన భక్తుల్లో ఒకరిగా రామలింగేశ్వరుడిని ఆయన దర్శించుకున్నారు. బుగ్గజాతరకు విచ్చేసిన ఎమ్మెల్యేకు ముందుగా ఆలయ కమిటీ సభ్యులు శాలువా, పూలమాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం గుండంలో కొలువుదీరిన స్వామివారి సన్నిధికి చేరుకున్న మల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ఏడాది వర్షాలు త్వరగా కురవాలని, పాడిపంటలు



సమృద్ధిగా పండాలని, ప్రకృతి సహకరించాలని, రైతులంతా బాగుండాలని ఆ బుగ్గరామలింగేశ్వర స్వామిని ఆకాంక్షించారు. బుగ్గ జాతర ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. బుగ్గ జాతరలో భక్తులంతా పాల్గొని, ఆ స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని ఆకాంక్షించారు. కార్తీక పౌర్ణమి వేళ భక్తజన సందోహం మధ్య జరిగిన స్వామివారి దర్శనం, ప్రత్యేక పూజలు, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలతో బుగ్గరామలింగేశ్వరస్వామి జాతర తొలిరోజు అత్యంత వైభవంగా, భక్తి పారవశ్యంతో సాగింది. ప్రత్యేక పూజల అనంతరం, స్థానికంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, బుగ్గ జాతర ఆలయ కమిటీ చైర్మన్ యాదయ్య, పీఏసీఎస్ చైర్మన్ హనుమంత్ రెడ్డి, సర్పంచ్ శుభ కుమార్, ఉపసర్పంచ్ నూకం రాజు, మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎడ్మ నరేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు సికిందర్ రెడ్డి, వార్డు సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, వివిధ గ్రామాల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా కార్తీక పౌర్ణమి జాతర

వేలాదిగా తరలి వచ్చిన భక్తులు

దండేపల్లి 24నవంబర్ (విజన్ ఆంధ్ర) తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన దండేపల్లి మండలంలోని గూడెం రమాసహిత సత్యనారాయణ స్వామి దర్శనానికి, కార్తీక పౌర్ణమి సందర్భంగా రాష్ట్రంలో ని వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకొన్నారు , స్వామి వారి వ్రతాలు. నోముకొన్నారు, భక్తులు అధిక సంఖ్యలో రావడంతో పోలీసులు అన్ని ప్రాంతాలలో పోలీసులు తగు జాగ్రత్తలు ఏర్పాట్లు చేశారు , గుట్టపైకి క్యూ లైన్ లో భక్తులు వెళ్లి స్వామి దర్శనం చేసుకొని తన్మయత్వం పొందారు, గోదావరి నదివద్ద భక్తులకు ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు ఏర్పాటు చేసి,నదిలోపలికి వెళ్లకుండా సూచనలు చేశారు, ఆలయ కార్య నిర్వహణ అధికారి సంకటాల శ్రీనివాస్ భక్తుల కోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తూఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూశారు, దండేటపల్లి , జన్నారం లక్షెట్టిపేట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బారి బందా వొస్తు నిర్వహించారు, కాగా రామగుండం సీపీ అంబర్ కిషోర్ జా సైతం గూడెం లో ప్రత్యేక శ్రద్ధ తో పరిస్థితులను పర్యవేక్షించారు,

కార్తీక పౌర్ణమి వేళ శివాలయంలో ప్రత్యేక పూజలు

-అన్నదానంలో పాల్గొన్న ఎడ్మ సత్యం

-భక్తి, సేవాభావంతో ప్రజల మధ్య మా ప్రయాణం

- ఎడ్మ సత్యం

కల్వకుర్తి, నవంబర్ 24, విజన్ ఆంధ్ర: కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈరోజు కల్వకుర్తిలోని శివాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో కల్వకుర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం పాల్గొన్నారు.

ఉదయం నుంచే శివాలయం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం సందర్భంగా భక్తులు శివునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పర్వదినాన శివాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎడ్మ సత్యం పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం అందించే కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు.

ఈ సందర్భంగా ఎడ్మ సత్యం మాట్లాడుతూ, ఆధ్యాత్మికతతో మనశ్శాంతి, సేవా కార్యక్రమాలతో ఆత్మసంతృప్తి లభిస్తుందని అన్నారు. భక్తి, సేవాభావంతో ప్రజల మధ్య తమ



ప్రయాణం కొనసాగుతుందని తెలిపారు. శివయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తండ్రి అడుగుజాడల్లో తనయుడు..!

- రామునాయక్ తాండ నూతన నాయక్‌గా చౌహన్ కైలాష్ నాయక్

- స్వర్గీయ చౌహన్ రామునాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఏ ఐ బి ఎస్ ఎస్ కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు

-పాగడి పట్టాభిషేక మహోత్సవానికి హాజరై ఆశీర్వదించిన ప్రముఖులు, కుల పెద్దలు



లింగాపూర్, నవంబర్ 24 (విజన్ ఆంధ్ర) : లింగాపూర్ మండలంలోని రామునాయక్ తండా 40సంవత్సరాల పాటు నాయక్‌గా సేవలందిస్తూ, గ్రామ ప్రజలకు న్యాయం, ధర్మం, సమన్యాయం అందించిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ చౌహన్ రామునాయక్ అని (ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం) కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు రాథోడ్ రవీందర్ నాయక్ అన్నారు. మంగళవారం స్వర్గీయ చౌహన్ రామునాయక్ నాయక్ తెర్వి పెద్దకర్మ కార్యక్రమాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి ప్రత్యేక పుష్పాభిషేకం చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు(ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం) జిల్లా సంఘం తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, భగవంతుడు కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, స్వర్గీయుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం గోర్ బంజారా సమాజ సంప్రదాయాల ప్రకారం గ్రామ నాయక్‌గా బాధ్యతలు నిర్వహించిన పెద్ద మనిషి మరణానంతరం ఆయన వారసుడైన కుమారుడికి ఆ బాధ్యతలు అప్పగించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా స్వర్గీయ చౌహన్ రామునాయక్ నాయక్ చిన్నా కుమారుడు చౌహన్ కైలాష్ నాయక్‌కు మంగళవారం బంజారా సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల ప్రకారం ఘనంగా పాగడి పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్ ఇండియా బంజారా సేవా సంఘ్ (ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం) ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు రాథోడ్ రవీందర్ నాయక్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి బహుజన బంజారా సోదరులు, కుల పెద్దలు, వివిధ గ్రామాల నాయక్‌లు, కారోభారీలు, డావ్‌లు, బంజారా భజన మండలి సభ్యులు, కవి గాయకులు, హాసాబీ, నసాబీ,రామునాయక్ తండా గ్రామ ప్రజలు, వివిధ సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వారి సమక్షంలో సంప్రదాయబద్ధంగా పాగడి పట్టాభిషేకం నిర్వహించి చౌహన్ కైలాష్ నాయక్‌ను రామునాయక్ తండా గ్రామ నూతన నాయక్‌గా ప్రకటించి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆశీర్వదించారు. అనంతరం రామునాయక్ తండా నూతన నాయక్ చౌహన్ కైలాష్ నాయక్ మాట్లాడుతూ.. తన తండ్రి తెర్వి కార్యక్రమానికి విచ్చేసి తమ కుటుంబానికి మనోధైర్యాన్ని అందించడంతో పాటు, తనపై నమ్మకం ఉంచి పగడి పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొని తండ్రి స్థానంలో గ్రామ నాయక్‌గా బాధ్యతలు అప్పగించి ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

తన తండ్రిపై గ్రామ ప్రజలకు ఉన్న నమ్మకం, విశ్వాసం, గౌరవాన్ని కాపాడుతూ ప్రతి ఒక్కరికీ న్యాయబద్ధంగా, సమన్యాయంతో సేవలందిస్తానని, గ్రామ అభివృద్ధికి మరియు బంజారా సమాజ ఐక్యతకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గ్రామపంచాయతీ ఉద్యోగుల సమస్యలపై ఐ ఎన్ టి యు సి తో కీలక చర్చలు

- ఐఎన్ టి యు సి నాయకుల హామీ

- తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ యునైటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు

- సాదుల శ్రీకాంత్, ఆధ్వర్యంలో

మల్హర్ నవంబర్ 24 (విజన్ ఆంధ్ర): హైదరాబాద్, నవంబర్ 24 తెలంగాణ రాష్ట్రంలోని గ్రామపంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కారోబార్లు, బిల్ కలెక్టర్లు, ఇతర గ్రామపంచాయతీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఐ ఎన్ టి యు సి ముఖ్య నాయకులు హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని జలసౌధ ఐ ఎన్ టి యు సి కార్యాలయంలో గ్రామపంచాయతీ ఉద్యోగుల సమస్యలు, పెండింగ్ డిమాండ్లు, హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత తదితర అంశాలపై కీలక చర్చలు నిర్వహించారు. తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ యునైటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సాదుల శ్రీకాంత్, ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఐ ఎన్ టి యు సి ముఖ్య ఉపాధ్యక్షులు మొగిల్లా రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగయ్య, గౌడ్‌లను కలిసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఐ ఎన్ టి యు సి నాయకులు స్పందిస్తూ గ్రామపంచాయతీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సంబంధిత ప్రభుత్వ పెద్దలతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఉద్యోగుల హక్కుల సాధన, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం ఐ ఎన్ టి యూ సి ఎల్లప్పుడూ అండగా నిలిచి పోరాటం చేస్తుందని భరోసా ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి ముందుకొచ్చి భరోసా కల్పించిన ఐ ఎన్ టి యు సి ముఖ్య నాయకులకు తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ యునైటెడ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం తరఫున అధ్యక్షులు సాదుల శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొంతుల సత్యం, తోలుకునూరి అశోక్, మేదరి రాజేందర్, నాగనబోయిన శ్రీనివాస్, గౌడ రాజమహేందర్, నాగరాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాడు మామ జయంతి వేడుకలు



గాదిగూడ, నవంబర్ 24(విజన్ ఆంధ్ర):శ్రీ సద్గురు బాడు మామ జయంతి వేడుకలను మహారాష్ట్ర కొల్హా పూర్ జిల్లా అద్దామాపూర్ తోపాటు తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో బాడు మామ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుగుతాయాన్ని సర్పంచ్ మాడావి తనాజీ అన్నారు. మంగళవారం మండలంలోని లోకారి –బి గ్రామంలో ప్రతి సంవత్సరం మధిరగానే కార్తీక పౌర్ణమి రోజును పుసర్కరించుకొన్ని బాడు మామ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.అనంతరం బాడు మామ జెండాను ఆవిష్కరించి చిత్రపటానికి పూలమాలవేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమం లో మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ బీమా భరోసా

- సర్పంచ్ మద్దెల వనజ స్వామి

దౌల్తాబాద్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ బీమా పథకం అమలు దిశగా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమైంది. ఇందులో భాగంగా దౌల్తాబాద్ మండల పరిధిలోని గోడుగుపల్లి గ్రామంలో సర్పంచ్ మద్దెల వనజ స్వామి ఇందిరమ్మ బీమా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించి అర్హులైన కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ బీమా పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు జీవిత బీమా భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న పెద్ద వ్యక్తికి అనుకోని ప్రమాదం లేదా దురదృష్టకర సంఘటన ఎదురైనప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడకుండా బీమా పథకం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడం ద్వారా వారి జీవనానికి భరోసా కల్పించవచ్చన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అవసరమైన వివరాలతో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.



త్రిశక్తి ఆలయంలో కార్తీక పౌర్ణమి శోభ..

- ప్రజ్ఞాపూర్ త్రిశక్తి ఆలయానికి పోటెత్తిన భక్తులు

- భక్తుల కొంగుబంగారం ప్రజ్ఞాపూర్ త్రిశక్తి ఆలయం

- మాజీ చైర్మన్ భాస్కర్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ

గజ్వేల్, 24 నవంబర్ 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌లోని ప్రసిద్ధ శ్రీ త్రిశక్తి దేవాలయంలో మంగళవారం కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ మాట్లాడుతూ, ప్రజ్ఞాపూర్ త్రిశక్తి దేవాలయం ఎంతో మహిమాన్వితమైనదని, భక్తుల కోరిన కోర్కెలు నెరవేర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతోందని కొనియాడారు. ఆలయంలో ప్రతి పౌర్ణమికి అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఎంతో అభినందనీయమని, ఈ పవిత్ర కార్యంలో తమ కుటుంబానికి అవకాశం కల్పించిన ఆలయ కమిటీ సభ్యులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్ ప్రజలందరికీ కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆలయంలో కొలువైన అమ్మవారు ఎంతో శక్తివంతమైనవారని, భక్తులందరూ ఆలయాన్ని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు. దాతల సహకారంతో ప్రతి పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో జరిగే అన్నదాన కార్యక్రమాలకు సహకరించదలచిన దాతలు ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ముదిరాజ్ సంఘం సభ్యులు, పద్మశాలి సంఘం సభ్యులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



బ్రహ్మోత్సవాలకు 50 రోజులే గడువు..



- అయినా రహదారుల దుస్థితిపై పట్టింపేది?
- ముల్కనూర్--కొత్తకొండ రహదారి గుంతలమయం..
- పైపైన తారురోడ్డు పనులతో హడావుడి
- -గట్ల నర్సింగాపూర్ వద్ద కొట్టుకుపోయిన బ్రిడ్జి..
- మట్టి రోడ్డుపైనే ప్రయాణం
- లక్షలాది మంది భక్తుల రాకపోకలకు ప్రమాదం పొంచి ఉన్నా స్పందించని అధికారులు !

భీమదేవరపల్లి: నవంబర్ 24 (విజన్ ఆంధ్ర) : ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని శ్రీ కొత్తకొండ వీరభద్ర స్వామి వారి బ్రహ్మోత్సవాలకు మరో 50 రోజుల సమయం మాత్రమే ఉంది. ఏటా బ్రహ్మోత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. అయితే భక్తుల రాకపోకలకు ప్రధాన మార్గాలుగా ఉన్న రహదారులు మాత్రం అధ్వానంగా మారడం ఆందోళన కలిగిస్తోంది.

ముల్కనూర్ నుంచి కొత్తకొండ గ్రామం వరకు ఉన్న ప్రధాన రహదారి గుంతలమయంగా మారి వాహనదారులకు నిత్యం ఇబ్బందులు కలిగిస్తోంది. బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో రహదారిపై అక్కడక్కడా పైపైన తారు వేసి తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పైపై మెరుగులు కాకుండా శాశ్వత పరిష్కారం చూపించాలని





స్థానికులు కోరుతున్నారు. ఈ రహదారిపై ప్రయాణించే భక్తులు, వాహనదారులకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు గట్ల నర్సింగాపూర్ నుంచి కొత్తకొండకు వెళ్లే రహదారిలో గట్ల నర్సింగాపూర్ వద్ద బ్రిడ్జి కొట్టుకుపోవడంతో మట్టి రోడ్డే ప్రధాన దారిగా మారింది. వర్షాలు కురిస్తే ఈ మార్గంలో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి దృష్టికి రహదారుల సమస్య

రవాణా శాఖల బాధ్యత వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రానికి వెళ్లే రహదారుల పరిస్థితి ఇలా ఉండటంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు కేవలం 50 రోజులే మిగిలి ఉన్న నేపథ్యంలో అధికారులు ఇప్పటికైనా స్పందించి యుద్ధప్రాతిపదికన రహదారుల మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

బ్రహ్మోత్సవాల సమయంలో ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే రహదారులను పూర్తిస్థాయిలో బాగుచేసి భక్తులకు సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ప్రజలు, భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

కళాంజలి నృత్యోత్సవంలో హుస్నాబాద్ విద్యార్థుల ప్రతిభ

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర నవంబర్ 24 : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంగళవారం రోజున నిర్వహించిన కళాంజలి డాన్స్ ఫెస్టివల్ 2026లో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన పద్మనయన కూచిపూడి కళాక్షేత్రం నిర్వాహకులు ఆచార్య కిరణ్ కుమార్ అధ్వర్యంలో యం.జేష్మిత సి ఎచ్.హరిణి,సి ఎచ్.దీక్ష , జి.మాన్విత,ఎన్.శ్లేషాశ్రీ, బి.సన్నిధి,ఇ.శ్రీవర్షబి. అనూజా, ఏ.సిద్ధిక, పి.అద్విత,వి.దేవాన్షిత,బి.సాహితిలాల్,విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా .మయూరి ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భారతీయ సాంప్రదాయ నృత్య కళారూపాల ప్రాధాన్యతను చాటుతూ కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా నృత్య ప్రతిభను గుర్తించిన నిర్వాహకులు విద్యార్థులందరికి సర్టిఫికెట్ ఆఫ్‌అచీవ్‌మెంట్ అందజేసి అభినందించారు.చిన్న వయస్సులోనే నృత్య రంగంలో ప్రతిభ కనబరిచి గుర్తింపు పొందడం పట్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో నృత్య రంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు ఆకాంక్షించారు.





1వ వార్డులో కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

- వార్డు ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- కౌన్సిలర్ కప్ప మమతా పోచయ్య



గజ్వేల్, 24 నవంబర్ 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఉచిత జీవిత బీమా పథకంను మంగళవారం 1వ వార్డు కౌన్సిలర్ కప్ప మమతా పోచయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రవేశపెట్టిన రూ.5 లక్షల ఉచిత జీవిత బీమా పథకం ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. వార్డులోని ప్రజలందరూ ఈ పథకంలో నమోదు చేసుకోవాలని సూచించారు. వార్డులోని కమిటీ హాల్ వద్ద మూడు రోజుల పాటు అధికారులు ఆన్‌లైన్‌లో బీమా నమోదు ప్రక్రియ చేపడుతున్నారని, వార్డు ప్రజలు తమకు అందుబాటులో ఉన్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నమోదు చేసుకోవాలని కౌన్సిలర్ కప్ప మమతా పోచయ్య కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బాకీ స్వామి ముదిరాజ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పొన్నాల కుమార్, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు నీరుడి స్వామి, ఎర్రవల్లి రాజు, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

?సారంగాపూర్, నవంబర్ 24 (విజన్ ఆంధ్ర): మండలంలోని కౌట్ల (బి) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సారంగాపూర్ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ కూనేరు భూమన్న మంగళవారం ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ఏ-గ్రేడ్ రకానికి రూ. 2,461, సాధారణ రకానికి రూ. 2,441 మద్దతు ధరతో పాటు గుర్తించిన సన్న వడ్లకు అదనంగా రూ. 500 బోనస్ పొందాలని ఆయన కోరారు. రైతులు 17 శాతం లోపు తేమ ఉండేలా ధాన్యాన్ని తీసుకురావాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి మాధవరావు, పిఎసిఎస్ చైర్మన్ నారాయణ రెడ్డి, బొల్లోజి నర్సయ్య, పిఎసిఎస్ సెక్రటరీ తోట మల్లేష్ రైతులు పాల్గొన్నారు.



బెల్లంపల్లిలో జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడా పోటీలు

- జోనల్ పోటీలకు 400 మంది క్రీడాకారుల ఎంపిక



బెల్లంపల్లి నవంబర్ 24 విజన్ ఆంధ్ర: బెల్లంపల్లి తెలంగాణ సంక్షేమ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో మంచిర్యాల జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, అండర్-17 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆకిడి విజయసాగర్ అధ్యక్షతన జరిగిన ఈ పోటీల్లో సుమారు 400 మంది బాలబాలికలు పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎండీ యాకూబ్ తెలిపారు.

ఈ పోటీలకు కే. రామ్మోహన్ రావు అబ్జర్వర్‌గా వ్యవహరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్-19 కార్యదర్శి బి. బాబురావు, గురిజాల సర్పంచ్ గోమాస శ్యామల, శ్రీకాంత్ పాల్గొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు బండి రవి, చాంద్ పాషా, రాజ మహమ్మద్, స్వరూప, శిరీష తదితరులు హాజరయ్యారు.

పోటీల నిర్వహణకు ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా అల్లూరి వామన్, ముత్యకుర్తి రాజశేఖర్ వ్యవహరించారు.

జగదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ రష్మి పెరుమాళ్

- పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశం

- జంగారెడ్డిపల్లి రాముడు బండ జాతర బందోబస్తు పరిశీలన



గజ్వేల్ నియోజకవర్గం, 24 నవంబర్ 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ఐపీఎస్ మంగళవారం జగదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్ ఆవరణ, రికార్డుల నిర్వహణతో పాటు సీజ్ చేసిన వాహనాలు, క్రైమ్ ప్రాపర్టీ భద్రతను ఆమె క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, 'డయల్ 112' కాల్స్‌కు తక్షణమే స్పందించాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో సైబర్ నేరాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని, 'సిద్దిపేట సురక్ష నేత్ర' కింద ప్రతి గ్రామంలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం జంగారెడ్డిపల్లిలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం వద్ద జరుగుతున్న రాముడు బండ జాతర బందోబస్తును సీపీ పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ గ్రామీణ సీఐ రవి రాజు, ఎస్ఐ కృష్ణ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అలింకో సంస్థ ద్వారా వృద్ధులకు వికలాంగులకు ఉచితంగా పరికరాల పంపిణీ

- హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వెన్నరాజు



హుస్నాబాద్ విజన్న ఆంధ్ర వంబర్ 24 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతొ అలీంకో సంస్థ ద్వారా హుస్నాబాద్ మండలంలోని వృద్ధులకు వికలాంగులకు వారికి చేయూతనివ్వాలనే ఉద్దేశంతో దివ్యాంగుల పరికరాలను ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమం ఈనెల 25వ తేదీ బుధవారం రోజున శ్రీకారం చుట్టడం జరిగిందని, చేపడుతున్నారని హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వెన్నరాజు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ వృద్ధులకు వికలాంగులకు చేయూతనివ్వాలని వారికి ఇబ్బందులు కలగకుండా పరికరాలు అందించాలని ఉద్దేశంతో రాష్ట్రంలోని ఎక్కడలేని విధంగా హుస్నాబాద్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో వికలాంగులకు పరికరాలు అందిస్తున్నారని,ఈ కార్యక్రమం చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి మండలంలోని స్థానిక సర్పంచులు ప్రజాప్రతినిధులు నాయకులు కృషి చేయాలని కోరారు.హుస్నాబాద్ మండలంలోని వికలాంగులు దివ్యాంగులు వృద్ధులు పెద్ద ఎత్తున ఇట్టి కాంపులో పాల్గొని ఇట్టి అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ బీమా భరోసా

- గోవిందాపూర్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

దౌల్తాబాద్,నవంబరు 24(విజన్ ఆంధ్ర): అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ బీమా పథకం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం గ్రామాల్లో ప్రారంభమైంది. ఇందులో భాగంగా దౌల్తాబాద్ మండల పరిధిలోని గోవిందాపూర్ గ్రామంలో సర్పంచ్ ఉప్పల దాసు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్హులైన కుటుంబాల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ ఉప్పల దాసు మాట్లాడుతూ కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న వ్యక్తి అనుకోని ప్రమాదం లేదా ఇతర దురదృష్టకర సంఘటనల కారణంగా మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు ఆర్థిక అండ కల్పించి, వారి జీవనానికి భరోసా కల్పించడమే ఇందిరమ్మ బీమా పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు. కుటుంబ యజమానిని కోల్పోయిన సమయంలో ఆ కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులను కొంతమేర తగ్గించేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పలు పథకాలను అమలు చేస్తోందని, వాటి ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా గ్రామస్థాయిలో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ బీమా పథకంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అర్హత కలిగిన



కుటుంబాలన్నీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు సమయంలో అవసరమైన వివరాలు, పత్రాలను సమర్పించి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శ్వేత తో పాటు తదితరులున్నారు.

నేడు మంత్రి శ్రీధర్ బాబు

పర్యటన



కాటారం డివిజన్ ప్రతినిధి, నవంబర్ 24 (విజన్ ఆంధ్ర): రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం డివిజన్ లో పర్యటించనున్నారు. ఉదయం మంథని ప్రాంతంలో పర్యటన కొనసాగగా, మధ్యాహ్నం మహాదేవపూర్ లో అగ్నిమాపక కేంద్రం, తాసిల్దార్ కార్యాలయం ప్రారంభోత్సవాలు, అనంతరం కాటారం మండల కేంద్రంలోని బిఎల్ఎం గార్డెన్ లో చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొననున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెప్పల దేవేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు చీమల సందీప్ తెలిపారు.

ఇందిరమ్మ బీమాతో నిరుపేద కుటుంబాలకు సామాజిక భద్రత

- సర్పంచ్ గజ్వేల్ దుర్గేశ్

దౌల్తాబాద్,నవంబర్ 24(విజన్ ఆంధ్ర): నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు సామాజిక భద్రతను అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని సర్పంచ్ గజ్వేల్ దుర్గేశ్ అన్నారు. గ్రామంలో ఇందిరమ్మ బీమా పథకానికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అనుకోని ఆపద ఎదురైనప్పుడు అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సందర్భాల్లో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులకు గురికాకుండా భరోసా కల్పించడంలో ఇందిరమ్మ బీమా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పథకం



ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తుల స్వీకరణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు, పంచాయతీ సిబ్బంది అర్హులకు సహకరించాలని సూచించారు.

వృద్ధులు, దివ్యాంగుల కోసం సహాయ పరికరాల పంపిణీ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

- సిద్దిపేట జిల్లా ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బొమ్మగాని రాజ్ కుమార్

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర నవంబర్ 25 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోఅర్హులైన వృద్ధులు మరియు దివ్యాంగులకు సహాయ పరికరాలు అందించేందుకుఈ నెల 25న బుధవారం రోజున మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేయడం జరుగుతుందని పోతారం ఎస్ గ్రామ వృద్ధులు, వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు బొమ్మగాని రాజ్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో అర్హులైన వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన సహాయ పరికరాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.వృద్ధాప్యంలో ఉన్నవారు, దివ్యాంగులు తమ దైనందిన జీవితంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించి, వారు ఆత్మగౌరవంతో జీవించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.కావున పోతారం ఎస్ గ్రామంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైన పత్రాలతో క్యాంపుకు హాజరుకావాలని కోరారు. గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు, సంబంధిత సిబ్బంది ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హాస్టల్ విద్యార్థులకు

క్రీడా సామాగ్రి అందజేత



కాటారం డివిజన్ ప్రతినిధి, నవంబర్ 24 (విజన్ ఆంధ్ర):
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర హాస్టల్ విద్యార్థులకు విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. ఇటీవల పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ హాస్టల్‌ను సందర్శించిన సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రీడా సామాగ్రి అందించాలని కోరగా, ఎంపీ స్పందించి వారి కోరిక మేరకు సామాగ్రిని అందజేశారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ ప్రాంతంలో ఇప్పటికే పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కాకా వెంకటస్వామి ఆశయాలను కొనసాగిస్తూ ఆయన వారసులు వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రజాసేవ, సంక్షేమ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. క్రీడా సామాగ్రి అందించిన ఎంపీ గడ్డం వంశీకృష్ణకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండం వసంత రెడ్డి, జావేద్ ఖాన్, మాల మహానాడు జిల్లా యువజన అధ్యక్షుడు సకినాల ప్రశాంత్, తొంబర్ల రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి వేళ సముద్రాల వరసిద్ధి మహా మృత్యుంజయ స్వామి ఆలయానికి భక్తుల తాకిడి

- ప్రత్యేక పూజలు, అభిషేకాలు..

- కన్నుల పండువగా దీపోత్సవం



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర నవంబర్ 24 : హుస్నాబాద్ నియోజకవర్గం లోని కోహెడ మండలం సముద్రాల గ్రామంలోని అత్యంత పురాతనమైన శ్రీ వరసిద్ధి మహా మృత్యుంజయ స్వామి దేవాలయం కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమైన పూజా కార్యక్రమాలు స్వామివారికి రుద్రాభిషేకం, మహా హారతి తదితర ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలతో కొనసాగాయి. సాయంత్రం నిర్వహించిన దీపోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దీపాల వెలుగులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమాలను ఆలయ ట్రస్ట్ సభ్యులు, ఆలయ అర్చకులు వీరభద్ర పర్యవేక్షించారు. కార్తీక పౌర్ణమి వేడుకలు భక్తి శ్రద్ధల మధ్య వైభవంగా జరిగాయి.

సర్వే చేసింది ఎవరు..

జాబితా మార్చింది ఎవరు. ?

- 2,265 ఇళ్ల నుంచి 847కు తగ్గిన అర్హుల సంఖ్య!

- ఐదు సర్వే బృందాల పరిశీలనపై నిర్వాసితుల అనుమానాలు

- మరణించినవారు బతికున్నట్లు..

- పెళ్లికాని యువతులకు మ్యారీడ్‌గా నమోదు!

మల్హర్, నవంబర్ 24 (విజన్ ఆంధ్ర): ఓసీపీ బ్లాక్-01 బొగ్గు గనికి 500 మీటర్ల డేంజర్ జోన్ పరిధిలో ఉన్న తాడిచెర్ల గ్రామంలోని ఇళ్ల సేకరణ, పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ పునరావాస ప్యాకేజీ వ్యవహారం రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతోంది. గత మూడు నెలల క్రితం నిర్వహించిన సోషల్ ఎకనామిక్ సర్వే, గతంలో చేపట్టిన డిజిటల్ సర్వేలు, గ్రామపంచాయతీ రికార్డులు ఒకవైపు ఉంటే.. తాజాగా విడుదలైన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో అర్హుల సంఖ్య భారీగా తగ్గిపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. 2022లో 2,265 ఇళ్లను ప్రిలిమినరీ నోటిఫికేషన్‌లో చేర్చిన అధికారులు, 2026 డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో కేవలం 847 గృహాలనే అర్హులుగా చూపడంపై నిర్వాసితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సర్వేలు ఎన్నో.. లెక్కలు మాత్రం తారుమారు!

2022లో డిజిటల్ సర్వే నిర్వహించి, సమ్మతి పత్రాలు సేకరించిన అధికారులు.. 2026లో మరోసారి ఐదు బృందాలతో సోషల్ ఎకనామిక్ సర్వే చేపట్టారు. దాదాపు నెల రోజులపాటు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించడంతోపాటు మరో రెండు నెలలపాటు డాక్యుమెంట్ల పరిశీలన చేసినట్లు చెబుతున్నారు. నిర్వాసితుల నుంచి పూర్తి వివరాలు, ఆధారాలు తీసుకున్న తర్వాత ప్రకటించిన జాబితాలో ఇంతటి వ్యత్యాసం ఎలా వచ్చిందనేది ప్రశ్నార్థకంగా మారింది.సర్వేలో మరణించిన వ్యక్తులను సైతం బతికున్నట్లుగా చూపించడం, వివాహం కాని యువతులను వివాహితులుగా 'మ్యారీడ్' అని నమోదు చేయడం వంటి తప్పులు చోటుచేసుకున్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు. సర్వే బృందాలతో కలిసి తిరిగి తమ ఇళ్ల వివరాలు నమోదు చేయించిన స్థానికుల పేర్లు సైతం అర్హుల జాబితాలో కనిపించకపోవడం మరింత విస్మయానికి గురిచేస్తోంది.

1,203 ఇళ్ల రికార్డులు.. తొలగింపులపై ప్రశ్నలు!

2022 ప్రిలిమినరీ నోటిఫికేషన్ అనంతరం 2023లో రెవెన్యూ బృందాలు నిర్వహించిన మరో సర్వేలో 1,203 ఇళ్లు గ్రామపంచాయతీ రికార్డుల్లో నమోదైనట్లు బాధితులు పేర్కొంటున్నారు. మరో 1,062 ఇళ్లను అనుమతులు లేని నిర్మాణాలుగా వర్గీకరించిన అధికారులు అనంతరం జరిగిన ప్రక్రియలో అనుమతులు లేని ఇండ్లు గా నమోదు చేసి తొలగించడంతోపాటు, రికార్డుల్లో ఉన్న ఇళ్లలోనూ సుమారు 350కి పైగా గృహాల వివరాలు తొలగించారని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. మరోవైపు సుమారు 1800 ల దరఖాస్తులను పరిశీలిస్తున్నామని గతంలో అధికారులు చెప్పినప్పటికీ, నెలల తరబడి సర్వేలు, డాక్యుమెంట్ల పరిశీలన తర్వాత కూడా అర్హుల జాబితాలో ఇన్ని లోపాలు ఎలా వచ్చాయంటూ బాధితులు నిలదీస్తున్నారు.

గ్రామసభలో ప్రశ్నలు.. అధికారుల మౌనం!

సోమవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ గ్రామసభలో నిర్వాసితులు పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేశారు. తమ ముందే సర్వే బృందాలు నమోదు చేసుకున్న ఇళ్ల వివరాలు జాబితాలో ఎందుకు కనిపించడం లేదని, కొత్తగా పేర్లు ఎలా చేరాయని అధికారులను ప్రశ్నించారు. అయితే ఈ ప్రశ్నలకు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అధికారులు మౌనం వహించారని, సరైన సమాధానాలు చెప్పకుండానే గ్రామసభను ముగించారని నిర్వాసితులు విమర్శిస్తున్నారు.

జాబితా తయారు చేసింది సర్వే బృందాలా.. అదృశ్య శక్తులా?

ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించిన ఐదు సర్వే బృందాలకు తెలియకుండా జాబితాలో కొత్త పేర్లు ఎలా చేరాయి? తమ ముందే నమోదు చేసిన పేర్లు ఎందుకు గల్లంతయ్యాయి? సర్వే బృందాలు తయారు చేసిన వివరాల ఆధారంగానే జాబితా రూపొందించారా? లేక మధ్యలో మరెవరైనా జోక్యం చేసుకున్నారా? అనే అనుమానాలు నిర్వాసితుల్లో వ్యక్తమవుతున్నాయి.జెన్కో అధికారులు ఇచ్చిన జాబితా ఆధారంగానే జిల్లా, రెవెన్యూ అధికారులు ముందుకు వెళ్లారా? పరిహారం, పునరావాస ప్యాకేజీ బాధ్యతలను తగ్గించుకునే ప్రయత్నంలో భాగంగానే నిర్దాక్షిణ్యంగా ఇళ్ల సంఖ్యను తగ్గించారా? అనే సందేహాలను సైతం బాధితులు లేవనెత్తుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై ఇప్పటివరకు అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.

ఇళ్ల పరిహారానికి ముందే ఆర్‌అండ్‌ఆర్ జాబితానా?

సాధారణంగా ఇళ్ల సేకరణ, పరిహారం ప్రక్రియ అనంతరం ఆర్‌అండ్‌ఆర్ పునరావాస ప్యాకేజీ అర్హుల జాబితాను ప్రకటించే విధానానికి భిన్నంగా తాడిచెర్లలో ముందుగానే ఆర్‌అండ్‌ఆర్ జాబితాను ప్రదర్శించడంపై నిర్వాసితులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కాపురం ఆదివాసీ గ్రామం సేకరణ సమయంలో ఇంటి పన్ను రసీదులు, స్థానికత, స్థానికేతరులనే తేడాలు లేకుండా అందరికీ ఇళ్ల పరిహారం ఇచ్చి, అనంతరం ఆర్‌అండ్‌ఆర్ జాబితాను తదుపరి గ్రామసభలో ప్రదర్శించారని గుర్తుచేస్తున్నారు.కానీ తాడిచెర్లలో మాత్రం ఇళ్ల సేకరణ, పరిహారం ప్రక్రియ పూర్తికాకముందే పునరావాస జాబితా ప్రకటించడం ద్వారా నిర్వాసితుల మధ్య స్థానికులు, స్థానికేతరులనే విభేదాలు సృష్టించి అసలు సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పారదర్శక విచారణే పరిష్కారం!

ఐదు సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలు, 2022 డిజిటల్ సర్వే, 2023 రెవెన్యూ సర్వే, గ్రామపంచాయతీ రికార్డులు, 2026 సోషల్ ఎకనామిక్ సర్వే వివరాలను బహిరంగంగా పోల్చి పరిశీలించాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు. అసలు అర్హుల జాబితాను ఎవరు రూపొందించారు? ఏ ప్రాతిపదికన 2,265 ఇళ్ల సంఖ్య 847కు తగ్గింది? సర్వేలో నమోదు చేసిన పేర్లు ఎందుకు గల్లంతయ్యాయి? కొత్త పేర్లు ఎలా చేరాయి? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలని కోరుతున్నారు.అర్హులకు అన్యాయం జరగకుండా నిష్పక్షపాత విచారణ చేపట్టి, తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, తొలగించిన ఇళ్ల వివరాలను తిరిగి పరిశీలించి అర్హులైన ప్రతి నిర్వాసితుడికి న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.